
# సాక్షి
## జోగులాంబ గద్వాల
శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



**తెరుచుకున్న సైఫన్లు**

భారీ వర్షాలు కురుస్తుండటంతో వరద నీటి రాక పెరిగి సరళాసాగర్ ప్రాజెక్ట్ సైఫన్లు గురువారం మరోసారి తెరుచుకున్నాయి.

-8లో ▶




**..చోరీలు ప్రవృత్తి**

జీవనోపాధికి క్యాటరింగ్ చేస్తున్న వారు ఈజీమనీకి ఆశపడి పశువుల చోరీకి పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు.

-8లో ▶

**వాతావరణం**

గరిష్ఠం/కనిష్ఠం
35.9 /22.5

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### 'గద్వాల గర్జన'ను విజయవంతం చేయండి



గద్వాల: ఈ నెల 13వ తేదీన గద్వాలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో గద్వాల గర్జన భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో గద్వాల గర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ గర్జన సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. మల్లీఖార్జున్, ప్రతాప్‌రెడ్డి, రాము, నర్సింహులు, అంజి, రాకేష్, కృష్ణ, శ్రీకాంత్, జగదీశ్ పాల్గొన్నారు.

### జైలు శిక్షకు బదులు సమాజ సేవ చేయాలని తీర్పు

కేటీదొడ్డి: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిని ఓ వ్యక్తికి జైలు శిక్షకు బదులు సమాజ సేవ చేయాలని జడ్జి తీర్పు ఇచ్చారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా... మండలంలోని నందిన్నె శివారులో డ్రంకెన్ డ్రైవ్ చేపట్టగా ఉమిత్యాల గ్రామానికి చెందిన ఈరన్న మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. ఈమేరకు కేసు నమోదు చేసి గురువారం జిల్లా కోర్టులో అతన్ని హాజరుపర్చగా అదనపు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఉదయ్‌నాయక్.. కొత్త చట్టం బీఎన్ఎస్ఎస్ మేరకు మద్యంలో మత్తులో చిక్కిన వ్యక్తికి జైలు శిక్షకు బదులు సమాజ సేవ చేయాలని తీర్పునిచ్చారు. ఈమేరకు శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు గద్వాలలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి జంక్షన్ వద్ద మద్యం మత్తులో వాహనం నడపవద్దని ప్లకార్డు పట్టుకొని నిలబడాలని, ఈ తీర్పు ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే అలవాట్లపై ఒక జాగృతి సందేశంగా నిలిచే అవకాశం ఉందని తెలిపారు.

### వేరుశనగ క్వింటా రూ.4,950

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు గురువారం 302 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. గరిష్ఠం రూ.4950, కనిష్ఠం రూ. 3059, సరాసరి రూ. 4219 ధరలు లభించాయి. అలాగే, 44 క్వింటాళ్ల ఆముదాలు రాగా, గరిష్ఠం రూ. 6129, కనిష్ఠం రూ. 6025, సరాసరి రూ. 6031 ధరలు పలికాయి.

# రెచ్చిపోతున్న రౌడీమూకలు

## సామాన్యులపై దాడులకు పాల్పడుతున్న పోకిరీలు



- ఖాకీలపై దాడికి వెనకాడని వైనం
- వరుస ఘటనలతో జనం బెంబేలు
- కొందరు రాజకీయ నాయకుల అండదండలు
- చర్యలకు వెనకాడుతున్న పోలీసులు

గద్వాల: జిల్లా కేంద్రమైన గద్వాలలో ఇటీవల రౌడీమూకలు రెచ్చిపోతున్నాయి. నిత్యం మద్యం మత్తులో తూగుతూ సామాన్యులతోపాటు ఏకంగా పోలీసులపైనా దాడులకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ వీధిరౌడీలు ప్రజలపై విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతున్నా చర్యలు తీసుకునేందుకు ఖాకీలే వెనకంజ వేయడం గమనార్హం. అయితే, కొందరు రాజకీయ నాయకులు ఈ రౌడీమూకలకు రక్షణ కవచంగా ఉంటుండడంతోనే పదుల సంఖ్యలో దాడి ఘటనలు చోటుచేసుకుంటున్నా పోలీసులు సైతం మిన్నకుండిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**గ్యాంగ్‌లుగా ఏర్పడి..**

పట్టణంలో మొత్తం జనాభా లక్ష వరకు ఉండగా.. ఇందులో 35శాతం మేర అంటే 35వేల మంది యువత ఉంటారు. వీరిలో చదువు మధ్యలో మానివేసిన వారు, దినసరి కూలీలు చేస్తున్నావారు, జల్సాలకు, మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ యువకులు గ్రూపులుగా ఏర్పడ్డారు. ఇలాంటి వాట్సాప్ గ్రూపులు 90కి పైగా ఉన్నట్లు సమాచారం. ఓ యూత్‌కు సంబంధించి 'చంపు–చావు' అనే పేరుతో ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూప్‌పై పెద్ద ఎత్తున దుమారం లేస్తుంది.ఇలా ఏర్పాటు చేసుకున్న గ్రూపుల ద్వారా నిత్యం ఒకరిమరొకరు టచ్‌లో ఉంటూ సమాచారాన్ని బదిలీ చేసుకుంటారు. ఈ క్రమంలోనే ఎక్కడైనా తమ గ్రూప్‌లోని ఫ్రెండ్ ఘర్షణలకు పాల్పడుతుంటే వెంటనే వాట్సాప్ గ్రూప్ ద్వారా సమాచారం తెలుసుకుని నిమిషాల్లో ఘర్షణ జరుగుతున్న స్థలాలకు చేరుకుని దాడులకు పాల్పడుతూ రెచ్చిపోతున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన తాజా మాజీ లీడర్లతో పాటు చిన్నాచితక మరో ముగ్గురు లీడర్లు గ్యాంగ్‌లను ఏర్పాటు చేసుకుని అన్ని రకాలుగా పెంచిపోషిస్తూ అండగా నిలబడుతున్నారనేది బహిరంగ రహస్యం. రాజకీయ ప్రాబల్యంతో కొనసాగుతున్న గ్యాంగ్‌లు మందు పార్టీలు చేసుకునే క్రమంలోనే దాడులకు స్కెచ్‌లు వేస్తూ అమలుచేస్తున్నట్లు సమాచారం.

**చర్యలేవి..?**

సామాన్యులు బైక్‌పై వెళ్తూ హెల్మెట్ పెట్టుకోకున్నా.. నిబంధనలు పాటించకున్నా పోలీసులు వారిని పట్టుకొని చలాన్లు వేయడం, ఇదేమని ప్రశ్నిస్తే లాఠీలు ఝుళిపించడం చూస్తుంటాం. కానీ, జిల్లా కేంద్రంలో ఆర్నెళ్లలో 40 వరకు దాడి ఘటనలు చోటుచేసుకోవడం, ఇందులో 70మంది వరకు తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నా.. వీరిపై దాడికి పాల్పడిన రౌడీమూకలపై మాత్రం పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ప్రజల నుంచి వినవస్తున్నాయి. దాడి ఘటనలకు బాధ్యులుగా పేర్కొంటున్న వీధిరౌడీలకు రాజకీయ నేతలు కొమ్ముకాస్తుండగా.. మరోవైపు రాజకీయ పలుకుబడితో పోస్టింగులు తీసుకున్న కొందరు పోలీసులు సైతం వీధిరౌడీలపై కఠినంగా వ్యవహరించలేకపోతున్నారనే విమర్శలు ఎదుర్కొంటూ అబాసుపాలవుతున్నారు.

**ఉక్కుపాదం మోపుతాం**



ఇటీవల కాలంలో చోటుచేసుకున్న దాడులు, వాటి బాధ్యులుగా ఉన్నవారిపై కఠినంగా వ్యవహరిస్తాం. దాడులు జరగకుండా కఠినచర్యలు తీసుకుంటాం. రౌడీయిజంపై ఉక్కుపాదం మోపుతాం. చట్టాన్ని అమలు చేసే క్రమంలో ఎవరైన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. ఆయా వాట్సాప్ గ్రూపులను నిర్వహిస్తున్న అడ్మిన్‌లు, లీడర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి కౌన్సెలింగ్ ఇస్తాం.

– టి.శ్రీనివాస్‌రావు, ఎస్పీ



గద్వాల పట్టణ పోలీసు స్టేషన్‌లో దాడికి దిగిన రెండు ప్రధాన పార్టీలకు చెందిన మూకలు (ఫైల్)

గద్వాల పట్టణం 36వార్డుకు చెందిన బీజేపీ, 23వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీలకు చెందిన లీడర్ల గ్యాంగ్‌లు మార్చిలో హోలీ పండుగనాడు కృష్ణానది వద్ద ఇరువర్గాలు దాడులు చేసుకోగా అక్కడి నుంచి పంచాయితీ కాస్త గద్వాల పట్టణ పోలీసుస్టేషన్‌కు చేరింది. అక్కడ కూడా ఇరువర్గాలు దాడులకు దిగారు. అక్కడే ఉన్న పోలీసులు లాఠీలు ఝుళిపించారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. దీనిపై ఇరువర్గాలకు చెందిన

**కొమ్ముకాస్తున్న నాయకులు**

బడాలీడర్లు రంగప్రవేశం చేయడంతో నామమాత్రపు సెక్షన్లు పెట్టి కేసును నీరుగార్చారనే విమర్శ ఉంది. అదేవిధంగా, మాజీ కౌన్సిలర్ మహేష్‌పై వినాయక నిమజ్జనం నాడు చోటుచేసుకున్న దాడి సంచలనం కాగా, దాడికి పాల్పడిన వారికి ఏకంగా ఓ మంత్రి కొమ్ముకాస్తుండడంతో కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు వెనకంజ వేస్తున్నారనే విమర్శ వినిపిస్తుంది. అదేవిధంగా, గద్వాల పట్టణం కొత్తబస్టాండ్, గంజిరోడ్డు ప్రాంతాల్లో వేర్వేరుగా చోటుచేసుకున్న దాడుల్లో వారించే ప్రయత్నం చేసిన పోలీసులపై రౌడీమూకలు దాడులకు పాల్పడి గాయపర్చాయి. ఇక్కడ కూడా రౌడీలకు రాజకీయ నేతలు కొమ్ముకాయడంతో కఠినచర్యలు లేకుండాపోయాయి. ఈ ఘటనలు పెద్ద దుమారాన్నే రేపగా గద్వాల పట్టణంలో శాంతిభద్రతల దుస్థితికి ఇవి అద్దం పడుతున్నాయి.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వారం రాష్ట్రవ్యాప్తంగా గద్వాల జిల్లా 20వ స్థానంలో ఉండగా ఈ వారం 15వ స్థానానికి చేరుకుందని ఇదేస్ఫూర్తితో పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వి.లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, డీపీఓ నాగేంద్రం, హౌసింగ్ పీడీ శ్రీనివాస్‌రావు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలు వంద శాతం అమలు చేయాలి**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పనులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయంలో కాన్ఫరెన్స్‌హాలులో ఉపాధిహామీ పనుల జాతర–2025పై సమీక్షించారు. గ్రామాల్లో ఉపాధిహామి కూలీలకు పనికల్పించాలని అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పనుల కార్యాచరణ ప్రణాళిక వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా జిల్లాలో నూతనంగా 29 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు ఏ స్థాయిలో కొనసాగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా పాఠశాలలో టాయిలెట్స్, పశువులపాకాలు, మేకల పాకలు, అజోల్లా యూనిట్లు, చెక్‌డ్యాంలు, పౌల్ట్రీ షెడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు, డీపీవో నాగేంద్రం, పీఆర్ శాఖడీఈలు, ఏఈలు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

**నియామకపత్రాలు అందజేత**

రెవెన్యూ శాఖలో ఎంపికైన గ్రామపాలనాధికారులు కీలకమని విధినిర్వహణలో నిబంధనలు పాటిస్తూ పనిచేయాలని కలెక్టర్ అన్నారు. తన ఛాంబర్‌లో నూతన గ్రామపాలనాధికారులకు నియామక పత్రాలు అందజేశారు. అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ, ఏవో భూపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల అగచాట్లు

అలంపూర్: పంటలను కాపాడుకోవడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎరువుల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలంపూర్ పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద గురువారం తెల్లవారుజాము నుంచే రైతులు యూరియా కోసం బారులు తీరారు. వర్షం పడుతున్నప్పటికి అక్కడే వేచి చూడాల్సి వచ్చింది. అధికారుల వచ్చేలోపు వర్షం తగ్గడంతో యూరియా కోసం క్యూలైన్‌లలో బారులు తీరారు. ప్రధానంగా సుల్తానాపురం, జిల్లెలపాడుతో ఆయా గ్రామాల రైతులు భారీగా తరలిరాగా.. ముందుజాగ్రత్తగా వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున్‌రెడ్డి రైతులకు టోకెన్లు అందజేశారు. పీఏసీఎస్ గోదాంకు 450 బస్తాలు వచ్చినట్లు ఏఓ తెలిపారు. రైతులకు ముందస్తుగా టోకెన్లు అందజేసి 225 మంది రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా అందించినట్లు తెలిపారు. సాయంత్రం వరకు పంపిణీ కొనసాగింది. అయితే యూరియా కోసం అధిక సంఖ్యలో రైతులు తరలిరాగా.. చాలామంది నిరాశతో వెనుదిరిగారు.



రైతులకు టోకెన్లు అందజేస్తున్న ఏఓ

# పత్రికల గొంతు నొక్కడం అప్రజాస్వామికం




- సాక్షి ఎడిటర్, జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం సరికాదు
- మీడియాపై అణచివేత విధానాలను ఖండించిన పాత్రికేయ సంఘాలు, రాజకీయ నాయకులు

'ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పత్రికల గొంతు నొక్కేలా వ్యవహరించడం శోచనీయం. ఇది ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం మంచిది కాదు' అని జర్నలిస్టు సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు ముక్తకంఠంతో ఖండించారు. ప్రశ్నించే గొంతులను నొక్కడం అంటే పత్రికా స్వేచ్ఛను హరించడమే అన్నారు. సాక్షి కార్యాలయాలపై దాడులకు దిగడం.. జర్నలిస్టులపై కుట్రపూరితంగా కేసులు నమోదు చేయడం ఏమాత్రం హర్షణీయం కాదన్నారు. 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డిపై ఏపీ ప్రభుత్వ ప్రోద్బలంతో అక్కడి పోలీసులు కేసులు నమోదు చేయడంపై మండిపడ్డారు. ప్రతిపక్షాల ప్రెస్ కాన్ఫరెన్స్ వార్తలు రాసిన సందర్భంలో కేసులు పెట్టడం దిగజారుడుతనమని.. భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని పేర్కొన్నారు. ప్రజల పక్షాన పనిచేసే జర్నలిస్టుల గొంతును నొక్కేసేలా వ్యవహరిస్తున్న అప్రజాస్వామిక చర్యలు సమర్థనీయం కాదంటూ.. 'సాక్షి' ఎడిటర్, పాత్రికేయులకు సంఘీభావం ప్రకటించారు.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

**తీవ్రంగా ఖండిస్తున్నాం..**



'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టడాన్ని మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ చాలా ముఖ్యమైనది. అభిప్రాయాలను పంచుకునేందుకు, ప్రభుత్వానికి ప్రజల వాణిని వినిపించడంలో పత్రికలు కీలకపాత్ర పోషిస్తాయి. పత్రికలపై, సంపాదకులపై పనిగట్టుకొని కేసులు నమోదు చేయడం దారుణం. ప్రజల గొంతుకగా నిలిచే మీడియా గొంతు నులిమే ప్రయత్నం చేయడం సరికాదు. పత్రికలు తమ పని తాము స్వేచ్ఛగా చేసినప్పుడే సమాజంలోని అన్నివర్గాల అభిప్రాయాలు ప్రజలకు చేరువవుతాయి.

– వి.నరేందర్‌చారి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

**కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి..**



ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను హరించేలా వ్యవహరించడం ఎవరికీ సమర్థనీయం కాదు. ప్రతిపక్షాలు మాట్లాడలేనప్పుడు కూడా ప్రజల సమస్యలు, ఇబ్బందులను పాలకుల దృష్టికి తీసుకొస్తాయి. అలాంటి పత్రికలు, మీడియాపై అణచివేతకు పాల్పడేలా దాడులకు దిగడం.. కేసులు నమోదు చేయడం అప్రజాస్వామిక చర్య. ప్రభుత్వాలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. ఇప్పుడు ఒకరు అనైతిక చర్యలకు దిగారంటే.. ఆ తర్వాత వచ్చే ప్రభుత్వం కూడా అలానే వ్యవహరించాల్సి ఉంటుంది. ఇలా చేస్తూ పోతే అభివృద్ధి కుంటుపడడమే కాకుండా రాష్ట్రం రావణకాష్టగా మారుతుంది. రాజకీయాల మాటున కక్షసాధింపు చర్యలు రాష్ట్రానికి, దేశానికి మంచిది కాదు. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉంటారు. ఇప్పటికైనా పత్రికా స్వేచ్ఛను హరించే చర్యలకు ఫుల్ స్టాప్ పెట్టాలి.

– శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి, మహబూబ్‌నగర్

**కలానికి సంకెళ్లు అప్రజాస్వామికం**



ఏపీలో 'సాక్షి' దినపత్రికపై కొనసాగుతున్న కేసులు, దాడులను తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజాస్వామ్యంలో పత్రికలపై అక్రమ కేసులు పెట్టి అడ్డుకోవాలనుకోవడం సిగ్గుమాలిన చర్య. 30 ఏళ్ల సీనియారిటీ అని చెప్పుకొనే చంద్రబాబు ఇలాంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరైనది కాదు. ప్రజాస్వామ్యంలో ఫోర్త్ పిల్లర్‌గా నిలిచి.. ప్రజాగొంతుకను వినిపించే పత్రికలపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు బనాయించడం కలానికి సంకెళ్లు వేయడమే. దీనిని ప్రతి ఒక్క ప్రజాస్వామికవాది ఖండించాలి. ఇప్పటికైనా చంద్రబాబు కక్ష సాధింపు చర్యలు మానుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.

– బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, గద్వాల

**జర్నలిజంపై దాడి సరికాదు**



ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా గుర్తింపు ఉన్న జర్నలిజంపై దాడి సరికాదు. ప్రజల పక్షాన గళం విప్పే పత్రికల గొంతు నొక్కడం ప్రజాస్వామ్య విరుద్ధం. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ ప్రధానమైనది. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపడం సరికాదు. పత్రికలలో వచ్చిన వార్తలు అభ్యంతరకరంగా ఉంటే వివరణ కోరాలే తప్ప అక్రమ కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దు. జర్నలిజం విలువల పరిరక్షణకు ప్రభుత్వాలు పాటుపడాలి. ఏపీలో 'సాక్షి' ఎడిటర్‌పై అనుసరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉంది.

– అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

**ప్రతిపక్ష పాత్ర పోషించాలి..**



జర్నలిస్టులు ఎక్కడైనా ప్రతిపక్ష పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఏపీలో ప్రశ్నిస్తున్న జర్నలిస్టులపై దాడులు, కేసులు నమోదు చేయడం వంటివి పత్రికా స్వేచ్ఛను హరించడమే అవుతుంది. ప్రశ్నిస్తున్న 'సాక్షి' ఎడిషన్ సెంటర్లపై దాడులు, ఆస్తులను ధ్వంసం చేయడం హేయమైన చర్య. పోలీసులు కూడా కేసులు నమోదు చేయకుండా తాత్సారం చేయడం తగదు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలు గెలిచిన తర్వాత నెరవేర్చకుంటే కచ్చితంగా జర్నలిస్టులు ప్రజల తరఫున ప్రశ్నించడం సహజం. ఎడిటర్ స్థాయి వ్యక్తులపై కూడా కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేయడం దారుణం. ఏకంగా జర్నలిస్టుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాల పేరుతో భయభ్రాంతులకు గురిచేయడం, పోలీసులు సైతం ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు.

– చంద్రశేఖర్‌రావు, జిల్లా అధ్యక్షుడు, టీయూడబ్ల్యూజే (హెచ్–143), నాగర్‌కర్నూల్

# జూరాలపై వెలుగులేవి?

## ప్రాజెక్టు రహదారిపై వెలగని విద్యుద్దీపాలు



జూరాల ప్రాజెక్టు రహదారిపై రాత్రిళ్లు వెలగని విద్యుద్దీపాలు

- ఏళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోని వైనం
- ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి
- పట్టించుకోని అధికారులు
- నిధులు మంజూరైనా.. ముందుకు సాగని పనులు

అమరచింత: ప్రియదర్శిని జూరాల జలాశయంపై రాత్రిళ్లు వెలుతురు ఉండేలా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు ఏళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోవడం లేదు. దీంతో ప్రాజెక్టు రహదారి రాత్రి సమయంలో చీకట్లు కమ్ముకొని వాహనదారులు, ప్రయాణికులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ, కర్ణాటక ప్రజలు ప్రాజెక్టు రహదారి మీదుగా తమ తమ గమ్యస్థానాలకు రాకపోకలు సాగిస్తుంటారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

**రూ.18 లక్షలు మంజూరైనా..**

జూరాల ప్రాజెక్టు రహదారిపై విద్యుద్దీపాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపడంతో రూ.18 లక్షలు మంజూరైనట్లు పీజేపీ అధికారులు వెల్లడిస్తున్నారు. కానీ నేటికీ మరమ్మతుల్లో మాత్రం వేగం కనిపించడం లేదు.

**గుంతలమయంగా మారిన రహదారి..**

ప్రాజెక్టు రహదారిపై అడుగడుగునా గుంతలపడి అధ్వానంగా మారింది. అమరచింత మండలం నందిమళ్ల పీజేపీ క్యాంపు సమీపంలోని సత్యసాయి తాగునీటి పథకం నుంచి ప్రారంభమైన ప్రాజెక్టు రహదారి జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం చింతరేవుల వరకు సుమారు 5 కిలోమీటర్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. రహదారి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాల్సి ఉన్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అసలే గుంతల రహదారి.. ఆపై రాత్రిళ్లు చీకట్లు అలుముకొని ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. రహదారి మరమ్మతుకు సైతం నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు సైతం పంపలేని స్థితిలో అధికారులు ఉన్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**దిష్టిబొమ్మల్లా మారిన స్తంభాలు..**

ప్రాజెక్టు రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాలు విద్యుద్దీపాలు వెలగని కారణంగా దిష్టిబొమ్మలుగా మారాయి. పదేళ్లుగా కాలిన బల్బులను తొలగించి కొత్తవి అమర్చకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఎడమ కాల్వ సమీపంలో విద్యుద్దీపాలు వెలగకపోవడంతో చేప వంటకాల విక్రయదారులతో పాటు చేపలు విక్రయించే మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడెక్కడో దొరికిన మొసళ్లను తీసుకొచ్చి జలాశయంలో వదులుతుండటంతో అవి రాత్రిళ్ల రహదారిపైకి వస్తుండటంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం..**



జూరాల ప్రాజెక్టుపై విద్యుద్దీపాల ఏర్పాటు సమస్యను అధికారులు నేటికీ పరిష్కరించడం లేదు. తాగు, సాగు నీటితో పాటు విద్యుదుత్పత్తికి ఉపయోగపడే ప్రాజెక్టుపై అంధకారం నెలకొంది. రాత్రిళ్లు వెలుతురు ఉండేలా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి.

– విష్ణువర్ధన్ యాదవ్, అమరచింత

**నిధులు మంజూరయ్యాయి..**



జూరాల ప్రాజెక్టు రహదారిపై విద్యుద్దీపాల ఏర్పాటుకు రూ.18 లక్షలు మంజూరయ్యాయి. వీటితో పూర్తిస్థాయిలో విద్యుత్ బల్బులు బిగించేందుకు కార్యాచరణ రూపొందించాం. సంబంధిత పనులను కాంట్రాక్టర్‌కు అప్పజెప్పాం. డ్యాంపై రాత్రిళ్లు చీకటి లేకుండా చర్యలు తీసుకుంటాం.

– జుబేర్ అహ్మద్, ఈఈ, గద్వాల

**ఏళ్లుగా తీరని సమస్య..**



ప్రాజెక్టు రహదారిపై విద్యుద్దీపాలు ఏళ్ల తరబడి వెలగకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్యను పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. రాత్రిళ్లు రహదారిపై ప్రయాణం చేయాలంటే భయపడుతున్నాం.

– వెంకటేష్, నందిమళ్ల (అమరచింత)

## క్లుప్తంగా

### మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

జడ్చర్ల: మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి వ్యక్తి మృత్యువాత పడిన ఘటన గురువారం స్థానిక పాత బజార్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. పాతబజార్‌లో నివాసం ఉంటున్న చెన్నయ్య(50) ఓ బెల్టు షాపులో మద్యం తాగి, బయటకు వస్తూ ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడ్డాడు. వెంటనే చుట్టు పక్కల వారు గమనించి డ్రెయినేజీ నుంచి బయటకు తీసి వైద్య చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చెన్నయ్య అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడికి కుమారుడు రాజు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా కాలనీలో బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహించడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

### విద్యుదాఘాతంతో రైతు మృతి

బల్మూర్: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని ఇప్పకుంట గ్రామంలో గురువారం వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఉప్పునుంతల మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన రైతు మెంట సలేశ్వరం(36) బల్మూర్ మండలంలోని ఇప్పకుంట గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డికి చెందిన 8 ఎకరాల భూమిని 15 ఏళ్లుగా కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 10న వ్యవసాయ పొలానికి భార్య రేణమ్మతో కలిసి వెళ్లి పత్తి, వరి, మొక్కజొన్న పంటల పనులు చేశారు. సాయంత్రం తాను కొద్దిసేపు ఆగివస్తానని చెప్పడంతో భార్య ఇంటికి వెళ్లింది. కాగా.. రాత్రి 9 గంటలైనా భర్త ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్దకు వెళ్లి చూడగా పొలం చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి షాక్‌తో మృతిచెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై సలేశ్వరం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

### ఉరేసుకొని యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. జిల్లా కేంద్రంలో సాదత్ వీధికి చెందిన మహ్మద్ బురాన్(20) పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరులేని సమయంలో అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. యువకుడి మృతిపై ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్‌లో ఈ నెల 5వ తేదీన వినాయక నిమజ్జనానికి వెళ్తున్న క్రమంలో విగ్రహం చెట్టును తాకి బోల్తాపడి ట్రాక్టర్‌లో ఉన్న మద్దిలేటి(50)పై పడింది. మద్దిలేటికి తల, మెడ భాగంలో బలమైన గాయాలు కావడంతో వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి మామ సురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### అమరవాయిలో కర్నూలు పోలీసుల తనిఖీ

మల్దకల్ :మండలంలోని అమరవాయి గ్రామంలో గురువారం కర్నూలు పోలీసులు అపహరణకు గురైన బైక్‌లను గుర్తించేందుకు మరో మారు తనిఖీలు నిర్వహించారు. బుధవారం కర్నూలు టూటౌన్ సీఐ నాగరాజు సిబ్బందితో అపహరణకు గురైన 25 వాహనాలను కర్నూలుకు తరలించిన విషయం తెలిసిందే. మిగిలిన వాహనాల కోసం తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పలువురు వాహనాలను వ్యవసాయ పొలాల్లోనే నిలిపి వేసినట్లు సమాచారం.

### చికిత్స పొందుతూ మహిళ మృతి

మాగనూర్: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. మాగనూర్ ఎస్‌ఐ పి.అశోక్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుర్వ సాలే మనోజ్‌కు ఇదే గ్రామానికి చెందిన గౌరమ్మ (21) తో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కూమారుడు ఉన్నారు. అయితే ఈ నెల 7న గౌరమ్మ కుటుంబ సభ్యులతో గొడవ పడి క్షణికావేశంలో ఇంట్లో ఉన్న సిలింగ్ ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి కిందకు దించారు. హుటాహుటిన మక్తల్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల చికిత్స చేసిన తర్వాత పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని విరించి ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెండు రోజుల చికిత్స అందించిన తర్వాత బ్రెయిన్‌డెడ్ అయిందని డాక్టర్లు తెలపడంతో తిరిగి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 8:45 గంటలకు చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. దీంతో మృతురాలి అన్న కుర్వ మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# జూరాలకు స్వల్పంగా పెరిగిన వరద



జూరాల నుంచి దిగువకు పారుతున్న వరద

- 4 క్రస్ట్ గేట్లు తెరిచి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్/మదనాపురం/రాజోళి: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద మళ్లీ పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం 39 వేల క్యూసెక్కులు ఉండగా.. గురువారం రాత్రి 7.30 ప్రాంతంలో 62 వేల క్యూసెక్కులకు పెరిగిందన్నారు. విద్యుదుత్పత్తికి 43,640 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71, ఎడమ కాల్వకు 550, కుడి కాల్వకు 690 క్యూసెక్కుల నీటిని వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.070 టీఎంసీలు ఉందన్నారు.

**కొనసాగుతున్న విద్యుదుత్పత్తి..**

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుందని ఏఈ శ్రీధర్ తెలిపారు. గురువారం ఎగువ 6 యూనిట్ల నుంచి 234 మెగావాట్లు, 310.136 మి.యూ., దిగువ 6 యూనిట్ల నుంచి 240 మెగావాట్లు, 337.283 మి.యూ. విద్యుదుత్పత్తి చేపట్టామన్నారు. రెండు కేంద్రాల్లో ఇప్పటి వరకు 647.419 మి.యూ. విద్యుదుత్పత్తి సాధించామని చెప్పారు.


### మళ్లీ తెరుచుకున్న సరళాసాగర్ సైఫన్లు..

బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎగువ నుంచి వరద చేరడంతో మండలంలోని సరళాసాగర్ సైఫాన్లు గురువారం తెరుచుకున్నాయి. ఒక ఉడ్, ఒక ప్రైమరీ సైఫాన్ తెరుచుకోవడంతో సుమారు 4 వేల క్యూసెక్కుల నీరు దిగువకు పారుతోంది. దీంతో చిన్నవాగు ప్రవహించి మదనాపురం వద్ద కాజ్‌వే నీట మునిగింది. అప్రమత్తమైన అధికారులు వాగు సమీపంలో ముందస్తు చర్యలు చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.



### రామన్‌పాడు రెండు గేట్లు ఎత్తి..

రామన్‌పాడు జలాశయానికి వరద పెరగడంతో అధికారులు గురువారం ఉదయం రెండు గేట్లు పైకెత్తి సుమారు 6 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సరళాసాగర్, ఊకచెట్టు వాగు నుంచి వరద పెరిగినట్లు గుర్తించిన అధికారులు ముందస్తుగా స్పందించి గేట్లు ఎత్తి నీటిని వదిలారు. జలాశయానికి వరద కొనసాగుతోందని.. అవసరమైతే మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉందని ఏఈ వరప్రసాద్ వివరించారు.



### సుంకేసులకు 30 వేల క్యూసెక్కులు..

సుంకేసుల జలాశయానికి గురువారం ఎగువ నుంచి 30 వేల క్యూసెక్కుల వరద వచ్చినట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఆరు గేట్లను మీటర్ మేర తెరిచి 26,676 క్యూసెక్కుల నీటిని దిగువకు, కేసీ కెనాల్‌కు 2,012 క్యూసెక్కులు వదిలినట్లు పేర్కొన్నారు.

# ఆరోగ్యశ్రీలో ఓపెన్ హార్ట్ సర్జరీ



సర్జరీ తర్వాత మహిళను పరీక్షిస్తున్న వైద్యులు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని సుశ్రుత ప్రజావైద్యశాల వైద్యబృందం ఓ పేద మహిళకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఓపెన్ హార్ట్ సర్జరీని విజయవంతంగా పూర్తిచేశారు. గురువారం ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆస్పత్రి ఎండీ డా.మధుసూదన్‌రెడ్డి, గుండెవైద్య నిపుణుడు భరత్ మాట్లాడుతూ.. దేవరకద్ర మండలం గోపన్‌పల్లికి చెందిన లక్ష్మి రెండు నెలల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిందని తెలిపారు. ఆమెకు మొదట ఈసీజీ, 2–డీ ఈకో,యాంజోగ్రామ్ పరీక్షలు చేయగా.. గుండెలోని ఎడమ కవటం పూర్తిగా మూసుకుపోవడంతో పాటు ఐదు సెం.మీ. వెడల్పులో రక్తం గడ్డకట్టి ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఆరు వారాల పాటు గడ్డకట్టిన రక్తం పలచబడటం కోసం మందులు, ఇంజక్షన్స్ ఇచ్చినట్లు వివరించారు. ఆ తర్వాత ఓపెన్ హార్ట్ సర్జరీ చేసి ఎడమ కవటం మార్పిడి చేసినట్లు తెలిపారు. ఇదే సర్జరీ బయట చేయాలంటే దాదాపు రూ. 6లక్షలతో పాటు మెడిసిన్ ఖర్చు ఉంటుందన్నారు. కానీ సుశ్రుత ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా ఎలాంటి ఖర్చు లేకుండా చేసినట్లు తెలిపారు. సీటీ సర్జన్స్ డా.హేమంత్, డా.ప్రవీణ్, మత్తుమందు డా.శ్రీధర్, గుండె వైద్యుడు భరత్ బృందం దాదాపు మూడున్నర గంటల పాటు శ్రమించి సర్జరీని విజయవంతంగా పూర్తిచేసినట్లు వివరించారు. ఈ ఆస్పత్రిలో ఇప్పటి వరకు వంద కేసుల వరకు స్టంట్ వేయడం జరిగిందని.. త్రంబో లైసిస్ వంటి సేవలు ఆరోగ్యశ్రీలో అందించినట్లు వెల్లడించారు. ప్రతి గురువారం ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన సీటీ సర్జరీ ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

### కామారెడ్డి జిల్లాలో మరికల్ గొర్రెల కాపరి మృతి



గుడిగండ్ల రామప్ప (ఫైల్)

మరికల్: కామారెడ్డి జిల్లా దేవునిపల్లి పరిధిలోని జాతీయ రహదారిపై గొర్రెల మందతో పాటు ఇద్దరి కాపరులను లారీ ఢీకొట్టిన ఘటనలో మరికల్‌కు చెందిన ఓ కాపరి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మరికల్‌కు చెందిన కాపరులు మేత కోసం గొర్రెల ను శ్రీరాంసాగర్ ప్రాజెక్టు సమీపంలో ఉన్న అడవులకు తీసుకెళ్లారు. తిరిగి బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాకు వచ్చేందుకు గొర్రెల మందతో పాటు ఇద్దరు కాపరులు గుడిగండ్ల రామప్ప, బసయ్యపల్లి మల్లేష్ వస్తున్నారు. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటల సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ గొర్రెల మందతో పాటు ఇద్దరి కాపరులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుడిగండ్ల రామప్ప (56) అక్కడికక్కడే మృతి చెందగా.. 26 గొర్రెలు మృత్యువాత పడ్డా యి. గాయపడిన మల్లేష్ కామారెడ్డి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో మరికల్‌లో ని బాధిత కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

### ఎంట్రెన్స్ కోసం ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు జాతీయస్థాయిలో నిర్వహించే ఐఐటీ, డిగ్రీ విద్యార్థులకు సెట్, పీజీ ఎంట్రెన్స్ కోసం నిర్వహించే పోటీ పరీక్షలకు ఆన్‌లైన్ విధానంలో ఫెర్మాట్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ మధు మోటమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో శిక్షణ పొందిన వారు అనేక ఎంట్రెన్స్‌లో ఉత్తీర్ణత సాధించారని, ఆసక్తి గల రు 97012 75354, 91337 05933 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

### అతిథి అధ్యాపకుల కోసం..

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డా.బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా.సుకన్య ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు అర్హులైన వారు శుక్రవారం సాయంత్రం లోగా దరఖాస్తులు చేసుకోవాలని, 15వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

# ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి



సైమన్ రాములు స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మన్ననూర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల స్ఫూర్తితో సమాజంలోని సకల జనుల సమస్యల పరిష్కారానికి మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాల్‌నర్సింహ అన్నారు. గురువారం మన్ననూర్‌లోని సైమన్ రాములు స్మారక స్తూపం వద్ద అచ్చంపేట డివిజన్ సీపీఐ కార్యదర్శి పెర్ముల గోపాల్ అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ప్రారంభ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాలకు ఉమ్మడి జిల్లాతోపాటూ అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి డివిజన్‌లోని ఏ మారుమూల పల్లెకు వెళ్లిన ఆనాటి వీరోచితమైన తెలంగాణ సాయుధ పోరాట త్యాగాలకు సంబంధించిన గుర్తులు కనిపిస్తాయన్నారు. సాయుధ పోరాటాల స్ఫూర్తిని నేటి తరాల వారికి తెలియజేసేందుకు ప్రతిఏటా సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు వారోత్సవాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు బాసటగా నిలిచిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ప్రభుత్వం తరపున నిర్వహిస్తామని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో హామీ ఇచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు కేశవులుగౌడ్, నర్సింహ, విజయ్, కృష్ణాజీ, శంకర్‌గౌడ్, రవీందర్, శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శివుడు, కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, లక్ష్మీపతి, అంజి, అశోక్‌గౌడ్, చంద్రయ్య, నాయకులు నర్సింహ, చందు, పర్వతాలు, కేశవులు, మధు, సర్వేశ్వర్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ టూర్ ప్యాకేజీకి విశేష స్పందన: ఆర్‌ఎం



యాత్రాదానం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌ఎం సంతోష్‌కుమార్, డిప్యూటీ ఆర్‌ఎంలు లక్ష్మీధర్మ, కవిత

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ టూర్ ప్యాకేజీలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రీజినల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టూర్ ప్యాకేజీల్లో భాగంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రతి నెల పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ డిపోల నుంచి భక్తులతో అరుణాచలంకు రెండు బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా మరిన్ని నడుపుతామన్నారు. ఇప్పుడు ఆర్టీసీ ఆధ్వర్యంలో 'యాత్రాదానం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. దేశంలోని ఏ ఆర్టీసీ సంస్థ ఇలాంటి వినూత్న కార్యక్రమం చేపట్టలేదన్నారు. అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడమే ఈ యాత్రదానం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు. దాతలు అందజేసే విరాళాల ఆధారంగా ఆర్టీసీ యాత్రాదానం పేరిట సదుపాయాన్ని కల్పించనట్లు తెలిపారు. ప్రముఖులు, కార్పొరేట్ సంస్థలు లాంటి వారు స్పాన్సర్ చేస్తే పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహారయాత్రలకు తీసుకెళుతామన్నారు. ఎవరైతే ఆర్థికంగా వెనుకబడి పర్యాటక స్థలాలకు వెళ్లలేకపోయే వారికి ఈ యాత్రదానంతో అవకాశం కల్పించవచ్చని అన్నారు. జిల్లాలోని ఎన్నో పర్యాటక స్థలాలు ఉన్నాయని, ఈ యాత్రదానం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు. యాత్రాదానం కార్యక్రమం మన రాష్ట్రానికే పరిమితం కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల, విజ్ఞాన వినోదకేంద్రాలకు కూడా పంపుతామని అన్నారు. అనంతరం యాత్రాదానం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు లక్ష్మి ధర్మ, కవిత, అకౌంట్ ఆఫీసర్ గంగాధర్. పర్సనల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, మహబూబ్‌నగర్ డిపో మేనేజర్ సుజాత పాల్గొన్నారు.

# వచ్చేనెల 16న పీయూ స్నాతకోత్సవం

- హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- పనులను పరిశీలించిన వీసీ



లైబ్రరీ హాల్‌ను పరిశీలిస్తున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నాలుగోవ స్నాతకోత్సవానికి వచ్చే నెల 16 తేదీన నిర్వహించనున్నారు. దీనికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారు. గురువారం వీసీ శ్రీనివాస్ పీయూ లైబ్రరీ సెంట్రల్ హాల్‌లో నిర్వహించే స్నాతకోత్సవ వేడుక పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధానం హాల్‌లో వేదికను మరింత పెద్దదిగా చేయించనున్నారు. అలాగే హాల్‌లో ఇటీవల చేసిన పలు మరమ్మతు పనులతో పాటు మరుగుదొడ్లు, ఇతర ఎలక్ట్రీషియన్ పనులను ఆయన పరిశీలించారు. స్నాతకోత్సవానికి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి లోటు పాట్లు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, వివిధ కమిటీల అధ్యాపకులకు ఆయన సూచించారు. వీసీ వెంట రిజిస్ట్రార్ రమేష్‌బాబు, కంట్రోలర్ ప్రవీణ, అడిషనల్ కంట్రోలర్ శాంతిప్రియ, అనురాధారెడ్డి, ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ కుమారస్వామి, సీనియర్ అధ్యాపకులు నూర్జహాన్, రాజ్‌కుమార్, జయనాయక్, రజిని, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ సిబ్బంది సేవలు అభినందనీయం



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అడవులు, వన్యప్రాణు ల సంరక్షణ కోసం అటవీ సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా ఫారెస్ట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆ యన ముఖ్య అతిథిగా హాజరై అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ.. జిల్లాలో విస్తారమైన అడవులు ఉండటంతో చిరుతల సంఖ్య పెరిగిందన్నారు. కొన్ని రోజులుగా జనావాసాల్లోకి సైతం వస్తున్నాయన్నా రు. ఈ క్రమంలో వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అటవీ సిబ్బంది చర్యలు చేపట్టాలని సూచించారు. విధి ని ర్వహణలో ఎంతో మంది అటవీ సిబ్బంది ప్రాణా లు కోల్పోతున్నారని.. వారి సేవలు చిరస్మరణీయ మన్నారు. అటవీశాఖ అధికారులతోనే టూరిజం శాఖ అభివృద్ధి చెందుతుందన్నారు. ఎకో టూరిజాన్ని ప్రచారం చేయడంలో అటవీశాఖ పాత్ర గొప్పదని అన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అని త, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డీఎఫ్‌ఓ సత్యనారాయణ, ఎఫ్‌డీఓ గణేశ్, ఎఫ్‌ఆర్‌ఓ అబ్దుల్ హాయ్, కమాలుద్దీన్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో అటవీ సిబ్బంది బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు.

# యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి



పెద్దకొత్తపల్లిలో జొన్న పంటను పరిశీలిస్తున్న పాలెం శాస్త్రవేత్త రాజశేఖర్

పెద్దకొత్తపల్లి: రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో విత్తనోత్పత్తి చేసుకునే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, తమ వ్యవసాయ క్షేత్రాలలో నాణ్యమైన విత్తనాలు ఎంచుకొని వాటి ద్వారా విత్తనోత్పత్తిని సాధించుకోవచ్చని పాలెం వ్యవసాయ శాస్త్రవేత్త రాజశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రం పెద్దకొత్తపల్లిలో వరి, జొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన వరి, జొన్న, కంది విత్తనాలను రైతులు వేసిన పంటలను వ్యవసాయ అధికారి శిరీషతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో సూక్ష్మదాతు లోపం నివారణకు ఫారుమాల్–4ను 250 గ్రాములు ఎకరాకు, కొనలు ఎర్రగా మారినందుకు సాఫ్ 450 మి.లీ. ఎకరాకు, కాండం తొలుచు పురుగు నివారణకు కాంట్రాక్టు 450 గ్రాములు ఎకరాకు పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు ముజీబ్, జానకీరామ్, మల్లేష్, రైతులు చెన్నమ్మ, రాములు పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా యువకుడి మృతి

- అమ్మాయితో చనువు వల్లే దాడి చేశారని ఆరోపణ
- డీఎస్పీకి ఫిర్యాదు



ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు



వెంకటేష్(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న యువకుడు తీవ్రగాయాలతో అనుమానాస్పదంగా ఉరి వేసుకొని మృతి చెందిన ఘట న కలకలం రేపుతోంది. మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామానికి చెందిన దర్పల్లి వెంకటేష్(23) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అమ్మాయితో చనువుగా ఉంటున్నాడని భావించిన సదరు అమ్మాయి కుటుంబ సభ్యులు ఈ నెల 8వ తేదీన రాత్రి 11 గంటల సమయంలో వెంకటేష్ ఇంటికి వచ్చి మా అమ్మాయి కన్పించడం లేదని అతడిని ఆటోలో తీసుకెళ్లారు. ఊరు శివారులో దాడి చేసి గాయపరిచారు. అప్పటికే అమ్మాయి ఇంటి వద్దే ఉన్నట్లు సమాచారం రావడంతో వెంకటేష్‌ను వదిలి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9న మాచన్‌పల్లి శివారులోని పంట పొలంలోని చింతచెట్టుకు వెంకటేష్ ఉరి వేసుకొని ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వెంకటేష్ మృతదేహాన్ని పరిశీలించి శరీరంపై తీవ్రంగా రక్తగాయాలు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఉండగా గురువారం మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, ముదిరాజ్ కులసంఘాల నాయకులు డీఎస్పీ వెంకటేశ్వర్లును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మృతుడి తండ్రి దర్పల్లి పెంటయ్య రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేశాడు. అమ్మాయి తరుపు వాళ్లు వెంకటేష్‌పై దాడి చేశారని, వెంకటేష్ మృతిపై అనుమానం ఉందని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని, పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా కేసు విచారణ సాగుతుందని డీఎస్పీ పేర్కొన్నారు.

# క్యాటరింగ్ వృత్తి.. చోరీలు ప్రవృత్తి

- ఈజీ మనీ కోసం పశువుల అపహరణ
- పలు జిల్లాల్లో అపహరించిన గ్యాంగ్
- క్యాటరింగ్ చేస్తూ ముఠాగా మారిన వైనం
- తొమ్మిది రోజుల్లో పట్టుకున్న పోలీసులు




విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి, అరెస్టు చేసిన దొంగల ముఠా

నవాబుపేట: జీవనోపాధికి క్యాటరింగ్ పనులు చేస్తూ హైదరాబాద్‌లో కలిసిన వారంత ఈజీ మనీకి అలవాటు పడ్డారు. గ్యాంగ్‌గా మారి పగలు పని చేసుకుంటూ మారుమూల ప్రాంతాలను ఎంచుకొని ప్రధానంగా ఆవులు చోరీ చేసి విక్రయించేవారు. పాడి ఆవులకు డిమాండ్ ఉండటంతో వాటిని అపహరించటం విక్రయించటం వృత్తిగా ఎంచుకొని నేరాలను విస్తరించినట్లు ఎస్పీ జానకి తెలిపారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో వరుస చోరీలు చేస్తూ పట్టుబడిన నిందితులకు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

**క్యాటరింగ్ పనులకు వెళ్లి**

జిల్లాలోని మహ్మదబాద్ మండలం జూలపల్లికి చెందిన కుమ్మరి అశోక్, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్‌కు చెందిన అఖిల్, నల్లగొండ జిల్లా గుంతకల్ మండలం ముకుందాపూర్‌కు చెందిన సాయికుమార్, వరంగల్ జిల్లా జనగామ మండలం పాకాలకు చెందిన బుర్కసాయి హైదరాబాద్‌లో క్యాటరింగ్ పనులకు వెళ్తూ గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. ఒకేసారి పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించాలని ఆవులు, ఇతర పశువులు చోరీ చేసి విక్రయించాలని నిర్ణయించుకొని చోరీలు ప్రారంభించారు. కాగా ఈ గ్యాంగ్ వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, యాదగిరిగుట్ట, సైబరాబాద్ తదితర జిల్లాలోని ప్రాంతాల్లో ఆవులను చోరీ చేసి విక్రయించారు. చోరీ చేసిన ఆవుల్లో రూ.లక్ష రూపాయలకు పైగా విలువ చేసే ఆవులతో పాటు దాదాపుగా రూ.14.50 లక్షల విలువైన పశువులు చోరీ చేసినట్లు ఎస్పీ వివరించారు.

**సీసీ కెమెరాలే పట్టించాయి**

ఈ నెల 2న మండల పరిధిలోని మరికల్ గ్రామంలో రెండు ఆవులు చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ద్వారా దర్యాప్తు చేయగా కూపీ లాగితే డొంక మొత్తం కదిలి అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టయిందని ఎస్పీ తెలిపారు. చోరీ చేసిన ఆవులను వారు తరలించే బొలెరో వాహనం నంబర్ ప్లేట్ తరుచూ మారుస్తూ చోరీలకు పాల్పడిందని, చోరీ చేసిన ప్రాంతం సమీపంలోనే పోలీసులకు చిక్కినట్లు ఆమె తెలియజేశారు.

**పోలీసులకు రివార్డులు**

కేవలం 9 రోజుల వ్యవధిలో అంతర్రాష్ట్ర పశువుల ముఠాను పట్టుకొని కేసును ఛేదించిన నవాబుపేట ఎస్‌ఐ విక్రమ్, ఏఎస్‌ఐ జనార్దన్, సిబ్బంది వెంకట్రా ములు, సురేష్‌బాబు, భాస్కర్, శెట్టినాయక్‌ను ఎస్పీ రివార్డులు అందజేసి అభినందనలు తెలియజేశారు.